# రక్తయజ్ఞం

## శ్రీ కలువకొలను సదానంద

(గతసంచిక తరువాయి)

వర్షం ఆగిపోయింది.

వర్షించిన మేఘం తేలిపోయింది.

దాహశాంతి తరవాత బట్టలాక్కోవడానికి శక్తిచాలక నిద్ర కళ్ళతో పడుకున్న కాముకిలా వుంది ప్రకృతి.

సుందరం కళ్ళు తెరిచాడు.

కొలిమిలో ఎర్రగా కాలి, సమ్మెట పోట్లు తిని, చుంయ్యి మంటూ నీళ్లలో మునిగిపోయిన ఇనుప బద్దీలా చలనరహితంగా పడివుంది అతని శరీరం. అతనిశక్తి అతని శరీరాన్ని విసిరి పారేసి, ఎక్కడికో పారిపోయింది.

అతని వీపుక్రింద ఇసుక చల్లగా వుంది. అతని ఒంటిని కోసుకుంటూ ప్రక్కగా సన్నటి నీళ్ళపాయ ప్రవహిస్తోంది. గౌరి అతనిమీద అశక్తంగా చెయ్యివేసి, పక్కకు పొర్లి పడుకుని వుంది. ఆమె కళ్ళు మూతలు పడ్డాయి. ముఖం తృప్తితో వెలిగిపోతోంది. ఆమె ఒంటిమీద బట్టలు లేవు. ఆమె గుండెలు లయబద్ధమైన శ్వాసతో కదులుతున్నాయి. నీటిపాయ ప్రక్కన — పాపపు ముద్దలా పడివున్న ఎర్రటిబట్టలు వుండ చుట్టుకుపోయి, రహస్యంలా నల్లగా కనిపిస్తున్నాయి.

గౌరి యింకా పులకరింతలోనే వుంది. ఆమె పెదవులమీద సెలయేటి కలకలలా సన్నటినవ్వు వెలువడింది. సుందరం ఆమె పక్కలోనుంచి పైకి లేవాలనుకున్నాడు. ఎలా? ఆమె చెయ్యి తన పైన వుంది. అతడు ఆచేతిని మెల్లగా తీసి అవతల పెట్టాడు. ఆమె చెయ్యి తడిసిన దారంలా క్రిందికి వాలిపోయింది.

సుందరం లేచి కూర్చున్నాడు.

ఆమె పైకి లేవలేదు. కళ్లు తెరవలేదు. విశ్రాంతి తీసుకుంటోంది. అది సామాన్యమైన విశ్రాంతి కాదు. ఎంతో ప్రయత్నంతో, ప్రయాసతో సాధించిన విశ్రాంతి! గొర్రెను మింగి ఉండ చుట్టుకు పడుకున్న కొండచిలువలా పడివుంది ఆమె. కోరిక ఆమెను మర్దించి పెదాలు నాక్కుంటూ వెళ్లిపోయింది. ఆమెకు విశ్రాంతి కావాలి! అప్పుడు—ఆమె దాహశాంతి తప్ప మరేమీ కోరలేదు. ఇప్పుడు— విశ్రాంతితప్ప మరేమీ కోరటంలేదు.

సుందరం— కామ గహ్వరం లాంటి ఆ వంతెనలోంచి బయట పడ్డాడు. రోడ్డుమీదికి వచ్చాడు. చీకటి! చీకటిగా వుందని అతడను కోవడంలేదు. దారి వెతుక్కోవడంలేదు. నడుస్తున్నాడు. తాను వేరు చీకటి వేరు అన్న భావం అతనికి లేదు. చీకటి గర్భంలోని ఓ వెల్లువ తాను! చీకటి తనను మింగేసింది. ఇక వెలుగులేదు. తెల్లవారదు... పిచ్చిగా పరిగెత్తి పోవాలనిపిస్తోందతనికి. దిక్కులను దాటి పోవాలని పిస్తోంది. అది ఎలా సాధ్యం? ఎంత దూరం పరుగెత్తినా దిక్కులు చేతికందవు. భూమి బల్లపరుపుగా వుంటే ఎంత బావుంటుంది! అంచుదాకా పరుగెత్తి, అవతలికి దూకేయవచ్చు!

విధి తనను చీకటి అనే విషవృక్షానికి అంటుగట్టేసింది. విషం ప్రాకి, తన శరీరం నల్లబడిపోయింది. తనను ఈ చీకటినుండి విడదీసే శస్త్రం ఎక్కడుంది?

తాను విషం త్రాగాడు. అది ప్రాణంతీసే విషం కాదు. సౌశీల్యాన్ని చంపివేసే విషం! ఆ విషం పేరు వ్యభిచారం!

'వ్యభిచారం పాపం అని నాకు తెలుసు! నా మనస్సూ, శరీరం రెండూ నా మాట విన్నాయి. నాది కాని ఏదో మహాశక్తి నన్ను అభ్యంతర పరచింది. ఆ శక్తి చాలా నిరంకుశమైనది. సద్బోధకంటే కూడా ఎంతో బలమైనది! నాకేమీ తెలియదు. నా దేహమంతా నరకంలో పడిపోయింది. అయ్యో!......'

లోతులు తెలియని నరకకూపంలో తలక్రిందులుగా పడిపోతున్నట్లుంది సుందరానికి. ఆ కూపం అడుగున గౌరి చేతులు చాచి

నవ్వుతూ నిలబడి వుంది. కూపం అంచున నిలబడివున్న సుశీల నలుసంత దీపంలా కనిపిస్తోంది. ఆమె లోపలికి తొంగిచూస్తూ 'బావా' అంటూ ఏడుస్తోంది,

'పడిపోయాను సుశీ!' అంటూ కేకవేశాడు సుందరం.

అతని కళ్ళు జిగేలు మన్నాయి, ఎదురుగా వేగంగా వస్తూవున్న లారీ అతన్ని తాకుతూ ఒక్క వూపున ఆగిపోయింది. సుందరం బానెట్ మీదికి తూలాడు.

డ్రైవరు కిందికి దిగాడు. కోపంతో కయ్యిమన్నాడు.

'ఇంకో క్షణంలో పడేవాడివే! వెంట్రుకవాసిలో బతికి బయట పడ్డావు. కళ్ళూ, చెవులూ రెండూ లేనివాడివి— రోడ్డుమీద కెందు కొచ్చావు? మమ్మల్ని చంపటానికా? పో, అవతలికి!' అంటూ కసిరేసి లారీలో ఎక్కి కూర్చున్నాడు. లారీ గుర్రుమంటూ వెళ్ళిపోయింది.

సుందరం మరబొమ్మలా నడుస్తున్నాడు.

'...ఇది నిజంకాదు! ఇంద్రజాలంలాటి అద్భుతం ఏదో జరిగిపోయింది, నేను ఎందుకిలా నడుస్తున్నాను? ఇది ఏ లోకం?... ఇదంతా ఒక కల! నేను కలలో విహరించాను. కలలో నడుస్తున్నాను, ఇదంతా అసత్యం! ఇప్పుడు నిజంగా నేనిక్కడలేను!... ఇంట్లో పడుకుని నిద్రపోతుంటాను! ఇక కాస్సేపటికి మేలుకుంటాను!... నా చుట్టూ ఈ చీకటి వుండదు, నేను ఈ రోడ్డుమీద వుండను, నా మంచంమీద కూర్చుని, ఆశ్చర్యపోయి చూస్తాను!... ఈ చేదు నిజమంతా కరిగిపోయి, కలగా నిలిచిపోకూడదూ?'

'నాగరాజు కూతురుతో నాకు లైంగిక సంబంధం ఏర్పడుతుందని నేను ఊహించనైనా లేదే! హఠాత్తుగా ఈ తప్పు ఎలా జరిగిపోయింది? చిన్నప్పటినుంచీ నా సుశీలనే ఊహించుకున్నాను. ఆమెనే కోరుకున్నాను. ఇవాళ చిత్రంగా గౌరి చేతుల్లో ఒంటరిగా చిక్కుకుపోయాను. ఆమె మగవాడై, నన్ను ఆడపిల్లను చేసేసింది. నన్ను చెరిచేసింది. మానభంగం చేసేసింది. నా శీలాన్ని గురించి నే నెంత గర్వపడ్డాను! కొండ కొనలాంటి నా ఔన్నత్యం ఫెళ్ళున విరిగిపోయింది. సిగ్గు సిగ్గు! సుశీలతో కలిసి పంచుకోవలసిన ఆనందాన్ని గౌరితో అనుభవించానా! ఛీ ఛీ!... శోభనం గదుల్లో పెళ్ళికూతుళ్ళు తారుమారైనట్లుగా వుంది! బొట్టు ఒకరికి కట్టి, బూతు మరొకరితో జరిగిపోతే, ఆ పొరబాటుకు సవరణ సాధ్యమా?... అయ్యో! నేనుకూడా — సుందరం అనే నేనుకూడా — తప్పు చేసేశాను! ఇదీ నమ్మశక్యం కాని నిజం! మనిషి తప్పు చేయడం మామూలు! ఇవాళ నేను కూడా మామూలు మనిషినైపోయాను! నా కిరీటం పతనమైపోయింది!...'

సుందరం గతుకుల్లో పడి నడుస్తున్నాడు. జుల్లుమంటూ చల్లటి గాలి వీస్తోంది. చలికి ఒళ్ళు కొంకర్లు పోతోంది. మృత్యువులాంటి చలి! యమయాతనలాంటి చలి! అతనికి తన శరీరం మీద కసి పుట్టుకొచ్చింది. వెధవ శరీరం! అంతటి అపవిత్రతనే భరించగలిగిన శరీరం — కేవలం చలిని భరించలేకపోతుందా?... భరించనీ! దీనిపట్ల దయ చూపరాదు!

ఊరి పొలిమేరలు దగ్గరపడ్డాయి. ఊళ్ళోని విద్యుద్దీపాలు మసకగా వెలుగుతూ కనిపిస్తున్నాయి. ఆ మిలమిలలు — తప్పు చేస్తూ దొరికిపోయిన స్త్రీ పురుషుల ముఖాల్లోని సిగ్గుల్లా వున్నాయి. రోడ్డు ప్రక్కగా — మలుపు తిరిగిన రైలుకట్ట మీద గూడ్సు రైలు ఆగిపోయి వుంది. చివరనున్న గార్డు పెట్టెలో — గుడ్డి దీపం గార్డు గుండెకాయలా బిక్కు బిక్కు మంటోంది. కొన్ని పెట్టెలు పట్టాలు తప్పాయి. ఒక పెట్టె మాత్రం పక్కకు దొర్లిపోయి, కట్ట దిగువ అనాకారంగా పడివుంది.

మరికొన్ని నిమిషాల్లో సుందరం తన యింటి ముందు నిలబడ్డాడు. ఊరంతా మత్తుగా నిద్రపోతున్నది. 'కొక్కొరోకో!' అంటూ తొలి కోడి కూస్తోంది. ఆ కూతకు — దట్టమైన చలి ఇనపరేకులా గరగర లాడింది.

మంచు కప్పుకుని, గొంతు చల్లబడిపోయిన కోడిలా 'అమ్మా!' అని పిలిచాడు సుందరం.

లోపల — అతని తల్లి నిద్రపోతున్నది.

అతడు రెండు మూడు సార్లు ఆమెను పిలిచాడు.

'అమ్మా!'

రెండక్షరాల ఆ శబ్దం అతని కెంతో ఊరట నిచ్చింది. అతని కనుకొలకుల్లో రెండు కన్నీటిబొట్లు నిలిచాయి.

రాజమ్మ నిద్రకళ్ళతో లేచివచ్చి తలుపు తీసింది.

సుందరం సరాసరి లోపలికి వెళ్ళి, మంచంమీద వాలిపోయాడు. 'ఇంత చలిలో ఎలా వచ్చావురా?' అంటూ రాజమ్మ అతనివైపు పరీక్షగా చూసింది. 'బట్టలు అలా వున్నాయేమిట్రా? వానలో తడిశావా ఏమిటీ? ఆ బట్టలు తీసెయ్యరాదూ?' అంటూ దగ్గరికి వచ్చి, ఒంటిమీద చెయ్యి వేసింది. అతని ఒళ్ళు చుర్రుమంటూ కాలి

పోతున్నది. 'అయ్యో! ఇదేం జ్వరంరా బాబూ? ఒళ్ళు యిలా కాగిపోతోందేమిటీ?' అంటూ కంగారు పడిందామె. తానే అతని బట్టల్ని విప్పేసి, ఒంటినిండా దుప్పటి కప్పి, అతని నుదురు, చెంపలూ నిమురుతూ పక్కన కూర్చున్నది.

పురుడు పోసుకోటానికి పుట్టింటికి వచ్చిన పక్కింటి అమ్మాయి అప్పుడే ప్రసవించిందేమో — ఆ నీరవ నిశ్శబ్దంలో 'ఉంగా! ఉంగా!' అంటూ బిడ్డ ఏడుస్తోంది.

తల్లి రొమ్ముల్లో పాలు చేపుకొచ్చింది.

సుందరానికి రెండు రోజులపాటు జ్వరం కాచింది. అతడు ఆ రెండు రోజులూ యింట్లోంచి బయటకు కదలలేదు. మనుషులకంట బడటానికి భయం వేస్తోందతనికి. అద్దంలో తన ముఖాన్ని చూసుకోవాలన్నా అసహ్యం వేస్తోంది. నిర్మలమైనవనుకున్న తన కళ్ళ లోతుల్లో మాలిన్యం నిండిపోయినట్లు, తన సౌందర్యాన్ని పురుగులు తినివేసినట్టు, తన ముఖం వికారంగా మారిపోయినట్లు అనిపిస్తోంది. అద్దంలోని తన ప్రతిబింబాన్ని చూడటానికి సిగ్గు వేస్తోంది.

ఫోటోలోని సుశీల విశాల నేత్రాల్లోకి సూటిగా చూడలేకపోతున్నాడు. ఆ కళ్ళు తనవైపే తిరిగివున్నాయి. ఆమె తనను గుచ్చి గుచ్చి చూస్తోంది. ఆ చూపులతో తన చూపులు కలుసుకుంటే, యింకేమైనా వుందా? ఆమె చూపులు తన కళ్ళలోకి చొచ్చుకుపోయి, లోపలి రహస్యాల్ని లాగి బయట పడేస్తాయి! సుశీల ముందు తన రంగు బయట పడిపోతుంది! తనలోని మచ్చ ఆమెకు తెలిసిపోతే, తరవాత ఈ బ్రతుకెందుకూ?... సుశీల కళ్ళలోకి చూడకూడదు. ఆమె హృదయ పీఠాన్ని వదులుకోకూడదు.

'నా మనస్సులోకి తొంగి చూడకు సుశీ!... పనికిమాలిన మనస్సు! దాంతో నీకెందుకూ? నీ మనస్సు మాత్రం నాకివ్వు! నా శరీరాన్ని తీసుకో! నా జీవితాన్నంతా తీసుకో! నా మనస్సు నీదే! దాన్నెందుకు పరీక్షిస్తావు? అనుమానం భూతద్దంలాంటిది? అది గోరంతను కొండంతగా చేసి చూపిస్తుంది. నా మనస్సులోవున్న చిన్న నలుసు నీ కంటికి కాటుకకొండలా కనిపిస్తుంది. నువ్వు నిరాశ పడిపోతావు. నువ్వు నిరాశ పడిపోతే నేను చీకట్లోకి పడిపోతాను. మనస్సు మీది పొరల్ని విప్పిచూడకు! దాని మానాన అది వుంటుంది. నాకు నువ్వూ, నీకు నేనూ వుంటే చాలదూ? ఇంకేం కావాలి? మనిద్దరం పెళ్లి చేసుకుందాం. ఇద్దరం ఒకే రోజున చచ్చిపోదాం. నువ్వు తప్ప నాకు వేరే ప్రపంచం లేదు. నా మాట నమ్మ సుశీ!...'

సుందరం గుండె బాధగా మూలిగింది.

'పందులు దొర్లిన బురదగుంటలా నా ప్రేమంతా యిలా కలుషితమైపోతోందేమిటీ? సుశీలతో నేను ఊహించుకున్న బ్రతుకంతా నటనగా తయారవుతుందా? స్వచ్ఛమైన నారికేళ సలిలం లాంటిది నా ప్రేమ. నా సుశీలనుండి నేను దాచుకోవలసింది ఏదీ లేదనుకున్నాను. హాలాహలంలాంటి ఈ రహస్యాన్ని ఎలా దాచుకోను? పూర్తిగా నిండిన నా హృదయభాండంలోంచి కొంత ప్రేమను కిందికి వొంచేసి, దుర్భరమైన ఈ రహస్యాన్ని అందులో దాచుకోవాలి. ఇది పైకి కనిపించకుండా, బూటకపు ప్రేమను దట్టంగా కప్పుకుని జాగ్రత్తపడాలి. అది మాయబ్రతుకు! మిథ్యా దాంపత్యం! ప్రాణంలా నివసించి, నీడలా వెంటనడిచే పెళ్ళాందగ్గర — భర్తకు రహస్యమా? అలాంటి భర్త అంతరంగం దయ్యంలాంటిది. దేవుడి వేషం వేసుకున్న దయ్యంతో ఆమె కాపురం చేయాలి. అయ్యో పాపం... పిచ్చి సుశీల!... ఆమెకు తెలియరాని ఈ పాపిష్టి రహస్యం నాపాలబడింది. నా హృదయం — సుశీల కన్నుగప్పి వ్యభిచరిస్తోంది. సుశీలకు చోటిచ్చిన నా హృదయంలో — ఈ రహస్యంకూడా చోటు చేసుకుంటోంది. ఓ రహస్యమా! నువ్వు బ్రహ్మరాక్షసివి! లక్క పిడతలాంటి ఈ చిన్న గుండెకాయలో ఇమిడిపోవడం నీకే చేతనౌను! నువ్వెక్కడికీ వెళ్ళకు! నా గుండెను గిల్లుతూ నాలోనే వుండిపో! నాతోనే చచ్చిపో!...'

గౌరి నీళ్ళకోసం కొళాయివద్దకు వచ్చినప్పుడల్లా — అక్కడ ఆమె ఉనికి స్పష్టంగానే తెలిసిపోతోంది. ఇంట్లోవున్న సుందరానికి వినబడేలా కాస్త బిగ్గరగా మాట్లాడుతోంది. కొళాయివద్ద మూగిన వాళ్ళతో అసందర్భమైన కబుర్లు చెబుతుంది. ఆ మాటల్లో కొత్త అందాలొచ్చాయి. ఆ నవ్వుల్లో సంగీతం వచ్చింది. చిత్రం ఏమిటంటే — ఇప్పుడామె ఎవరితోనూ పోట్లాడటంలేదు. బండబూతులు తిట్టడంలేదు. బుద్ధిమంతురాలిలా నడుచుకుంటోంది. ఆమె కంఠస్వరంలో — సుందరంకోసం అన్వేషణ ప్రస్ఫుటమవుతోంది.

'శివరాత్రికి నువ్వు యింట్లోనే వున్నావా అండాళ్ళూ?' ... అది గౌరి గొంతు.

'ఇంట్లో వుండకుండా యింకెక్కడికెళ్ళను?'

'నేను తిరణాలకెళ్ళాను. ఎంత బాగుందని! అబ్బ! వానలో తడిసి ముద్దయిపోయాం!'

'ఎవరెవరు?'

'అందరూ!' అంటూ నవ్వింది గౌరి.

'ఇవాళ కొత్త సినిమానా ఏమిటీ? గోడలమీద బొమ్మలంటిస్తున్నారు.'

'ఈ సినిమా నేను చూశాను — మా మామయ్య వాళ్ళ వూళ్లో!' ... గౌరి.

'ఎలావుంది? బాగుందా?'

'ఛఛా! ఏమీ బాగాలేదు. పాడువేషాలు! సిగ్గేస్తుంది!'

'గౌరీ! ఇక్కడే నుంచున్నావేం? తొందరగా కానీ! అక్కడ నీళ్లు లేవు ...' హోటల్ కుఱ్ఱాడి గొంతు.

'అంత తొందరేంరా? ఇక్కడున్న వాళ్లంతా మనుషులు కాదూ? ...'

ఆమె గొంతు వినిపించినప్పుడల్లా సుందరం ఒళ్ళు చల్లబడిపోయి, నిర్జీవమై పోతోంది. కళ్లు భయంతో మూసుకుపోయి, గుండె భారంతో కృంగిపోయి, మస్తిష్కం — చీకట్లతో, ఉరుములతో, మెరుపులతో, పిడుగులతో నిండిపోతోంది.

'దేవుడా! ఇకనాతో చెలగాటం చాలించు! ... భూమిలో నీళ్లంతా యింకిపోనీ! ఈ కొళాయి మూతబడిపోనీ! గౌరి — వాళ్ల యింట్లోనే వుండిపోనీ!'

జబ్బు నయమైన తర్వాత సుందరం బడికి బయలుదేరుతూ వీధిగుమ్మం దాటుతున్నాడు. అప్పుడే కొళాయి దగ్గరకు వస్తున్న గౌరి అతన్ని చూచి బొమ్మలా నిలబడిపోయింది. కొంటెగా అతనివైపు చూచి నవ్వింది. ఆమె మెడలో ముత్యాలహారం వుంది! వేలితో హారాన్ని సర్దుకుంది ఆమె.

సుందరం తల వంచుకుని గబగబా నడిచాడు ... ఆ దండ గౌరి చేతిలోకి ఎలా పోయింది? తానిచ్చాడా? లేదే! వంతెన కింద జారిపడిపోయిందేమో! గౌరి తీసుకుంది. సుశీల కోసం కొన్న హారం అది! దేవుడి నైవేద్యాన్ని కుక్క ముట్టుకుంది!

గౌరి అలా నిలబడిపోయి నవ్వుతుందేమిటి? ఎవరైనా చూస్తే ఏమనుకుంటారు? నాగరాజుకు తెలిస్తే కొంప మునిగిపోదూ?

ఆ సాయంకాలం బడి వదలిన తర్వాత అతడు వెంటనే ఇంటికి వెళ్లలేదు. ఆ సమయంలో గౌరి కొళాయి వద్దకు వస్తుందని అతని భయం. రైలుకట్టవైపు వాహ్యాళి వెళ్లాడు. ఊరి పొలిమేరల కవతల పట్టాలు తప్పిన బండి యిప్పుడక్కడ లేదు. ఇప్పుడా పెట్టెలన్నీ ఎక్కడో ఓ చోట పట్టాలమీద లక్షణంగా పరుగెడుతుంటాయి. అయితే ఒక్క వ్యాగను మాత్రం అక్కడే మిగిలిపోయింది. అది — తలుపులన్నీ విరిగిపోయి, నొక్కులు పడిపోయి, రైలుకట్ట ప్రక్కన పల్లంలో బోల్తాపడి వుంది.

* * *

సుందరం బొమ్మలు వేస్తాడని ఆ వూళ్లో చాలమందికి తెలుసు!

ఓ రోజు ఓ పదేళ్ళ పిల్ల సుందరం యింటికి వచ్చింది.

తెల్లటి చేతిరుమాలు అతని ముందు పరిచి 'బొమ్మ ఒకటి గీచియ్యి అన్నయ్యా!' అంది.

అతను రుమాలు చేతికందుకున్నాడు.

'ఏం బొమ్మ?'

'మరి — ఓ అందమైన పువ్వు, దానిమీద ఓ అందమైన సీతాకోక చిలుక!'

అతడు వింతగా ఆ అమ్మాయి ముఖంలోకి చూశాడు. ఆ ముఖం చాలా అమాయకంగా వుంది.

'నాక్కాదన్నయ్యా! గౌరికి!' అంటూ నవ్వింది ఆ అమ్మాయి.

సుందరం ఉలికిపడ్డాడు.

'ఏ గౌరి?'

'గౌరీ తెలియదూ?'

గౌరి తనను రాచపుండులా పట్టుకుంటోంది!

అతని చేతిలో నుంచి రుమాలు జారి క్రింద పడింది.

'నాకు బొమ్మలు గీయటం చేతకాదు. ఇంకెవరి దగ్గరన్నా గీయించుకో!'

'గౌరి నీచేతే వేయించుకురమ్మంది.' అంటూ ఆమె రుమాలును మళ్ళీ అతని చేతిలో కుక్కింది.

సుందరం పెన్సిలు తీసుకున్నాడు. పేరు తెలియని ఓ పెద్ద పువ్వు గీచాడు. ఆ పువ్వు నేలమీద పడివున్నట్లుగా వుంది. ఓ చిన్ని సీతాకోక చిలుక — బరువైన ఆ పువ్వు క్రింద రెక్క చిక్కుకోగా, ఎగిరిపోలేక విలవిల లాడుతోంది.

'ఇందా! తీసుకెళ్ళు!'

'ఇదేమిటన్నయ్యా, ఇలా వేశావు?'

'అదంతే! నీ కెందుకూ? నువ్వెళ్ళు!' అంటూ కసురుకున్నాడతను. రుమాలు తీసుకుని ఆ పిల్ల వెళ్లిపోయింది.

రెండు రోజులు గడిచిన తర్వాత మళ్ళీ వచ్చింది.

'ఎందుకొచ్చావు?' అన్నాడు సుందరం కోపంగా.

'నువ్వు వేసిచ్చిన బొమ్మను గౌరి చాలా మెచ్చుకుందన్నయ్యా! ఈ అల్లిక నీకు చూపించి రమ్మంది.' అంటూ ఆ అమ్మాయి రుమాలు విప్పి చూపించింది.

రంగు దారాల అల్లిక అందంగానే వుంది. పువ్వు ఎర్రగా వుంది. దాని కింద చిక్కుకున్న సీతాకోకచిలుక రెక్కలు నీలంగా వున్నాయి. బొమ్మను చూస్తూ వున్న సుందరం కంటిమీద రెప్ప పడలేదు.

'ఎలా వుందన్నయ్యా?'

'బాగుంది!'

ఆ అమ్మాయి రుమాలు అందుకుని తుర్రున వెళ్ళిపోయింది.

తరువాత గౌరి ఓసారి అతనికి ఎదురుపడింది. అతన్ని చూచి తియ్యగా నవ్వింది. నడుమున దోపుకున్న రుమాలు తీసి అందంగా పెదాలు తుడుచుకుంది.

సుందరం గబగబా యింట్లోకి వచ్చిపడ్డాడు. మన్మథుడు తనను వెంటాడుతున్నాడు. గౌరి అనే బలమైన ఆయుధం తనమీద ప్రయోగింపబడుతోంది. సుశీల మీద పాతుకుపోయిన తన గుండెను పెకలించివేయాలని చూస్తోంది గౌరి. అలా జరగనివ్వకూడదు. గౌరిని తాను మరిచిపోవాలి. ఆమె చూపులకు, నవ్వులకు, చేష్టలకు అచంచలంగా నిలబడాలి! తన సుశీల తప్ప యింకో లక్ష్యం తనకుండ కూడదు. లోకంలో బుద్ధిపూర్వకంగానే ఎందరు తప్పుచేయటంలేదు? వాళ్ళ తప్పులన్నీ మరుగు పడిపోవటంలేదూ? తనతో నిమిత్తంలేకుండా తన శీలం చెడిపోయింది. పోతేపోనీగాక! ఏం చేయగలడు తాను? ఏమీ జరగనట్లే వుండిపోవాలి!... గౌరి కూడా చెడిపోయింది. ఎవరికీ తెలియదు. పాపం, గౌరి! ఆమెపట్ల జాలి చూపరాదు. తాను కఠినుడై పోవాలి. రైలు ప్రయాణంలో రెస్టారెంటు భోజనంలా — జీవితంలో ఆమె తనకు తారసిల్లింది. అంత తప్ప ఆమెకూ, తనకూ యింకేమీ సంబంధం లేదు. సంచలనానికి చోటివ్వక మనస్సును అదుపులో పెట్టుకోవాలి. క్రమశిక్షణ లేని మన్మథుణ్ణి మెడపట్టి గెంటేయాలి! వాణ్ణి కాల్చిపారెయ్యాలి!

సుందరం కాగితం తీసుకున్నాడు. వంకరటింకర గీతలతో ఓ బొమ్మ గీచాడు. ఒకరినొకరు గాఢంగా కౌగిలించుకుని నగ్నంగా నిలబడ్డ స్త్రీ పురుషులు!... అతడు చిక్కగా ఎర్ర రంగు కలిపాడు. ఆ రంగునంతా బొమ్మమీద మరకలు మరకలుగా, చారలు చారలుగా ఒలకబోశాడు. కాగితం నెత్తుటితో తడిసినట్లు తయారైంది. కొంతసేపటికి రంగులు ఆరిపోయాయి.

'వీడి పేరే కాముడు! కాముణ్ణి నామరూపాలు లేకుండా కాల్చి, బూడిద చేసేస్తాను!'

సుందరం అగ్గిపుల్ల గీచి ఆ బొమ్మకు నిప్పంటించాడు. కాముడు భగభగా కాలిపోతుంటే, ఆ వెలుగులో సుందరం ముఖం సంతోషంతో మెరిసింది.

ఆ రాత్రి — తానూ, గౌరీ పెళ్లిపీటల మీద కూర్చున్నట్టు, తమ ఎదురుగా సుశీల తల విరబోసుకుని ఏడుస్తున్నట్టు కల వచ్చింది. సుందరం అదిరిపడి లేచి కూర్చున్నాడు. అతనికి భయం వేసింది. గౌరికీ, తనకూ పెళ్లి! వర్ణాంతర వివాహం!వర్ణ విభేదాలు తనొక్కడు పాటించకపోయినంత మాత్రాన సమస్యలు తీరిపోయి నట్లేనా? ... నాగరాజు ఒప్పుకుంటాడా? ఒప్పుకున్నాడుపో; అమ్మ మాత్రం చచ్చినా ఒప్పుకోదు. ఆమె కడుపులో పిడుగు పడుతుంది. వర్ణాంతర వివాహం అనేది — మధ్యతరగతి జీవితాల్లో కేవలం ఒక ఆదర్శంగా వుంటోందిగానీ, సర్వసాధారణమైన సామాజిక వ్యవస్థగా యింకా పరిణతి చెందలేదు. గౌరిని తాను పెళ్లి చేసుకుంటే, ఆ బ్రతుకెలా వుంటుంది? అమ్మ ఆశలన్నీ అణగారిపోతాయి. బంధువులు చిన్నచూపు చూస్తారు. ఊళ్ళోవాళ్ళంతా — ఏదో చిత్రమైన కబురు చెప్పుకుంటున్నట్లు హేళనగా మాట్లాడుకుంటారు. 'పాపం, సుందరం!' అని జాలిపడతారు ... యింతదూరం ఎందుకు ఆలోచించాలి? తన హృదయం సుశీలను కోరుకుంటోంది. ఆమె లేకపోతేకదా ఈ పరిణామాలు? తనకు సుశీలే కావాలి! ఆమెది ఏ కులమైనా ఫరవాలేదు!

కన్ను మూస్తే ఆ కల మళ్లీ వస్తుందేమోనని భయంవేసింది సుందరానికి, ఆ రాత్రి అతనికి నిద్రపట్టలేదు.

అతను కంటబడినప్పుడల్లా—గౌరి వాలుచూపులు విసురుతూ, చిరునవ్వులు ఒలకబోస్తూనే వుంది.

రోజులు గడిచిపోతున్నాయి.

క్రమంగా ఆమె ముఖంలో నవ్వులు మాసిపోయాయి. సుందరం కనబడగానే పక్కకు తప్పుకుని తలొంచుకుని నడుస్తోంది.

కొన్నాళ్ల పిదప — కొళాయి వద్దకు రావడమే మానుకొంది.

'...జరిగిందంతా ఓ పీడకల! తెల్లవారగానే యింటికి పోలీసొచ్చి, రాత్రి కలలో నువ్వు ఖూనీ చేశావు గనుక నిన్ను అరెస్టు చేస్తున్నాము – అంటాడా ? ... పీడకల భయపెడుతుందిగానీ, నిజంగా బ్రతుకులోకి జొరబడదు!' అనుకున్నాడు సుందరం.

## 8

మనిషికి లేనివాటిలో – ఎక్కడెక్కడ, ఏం జరుగుతూవుందో తెలుసుకోగల దివ్యదృష్టి ఒకటి. అలాంటి శక్తివుంటే, మనిషి ప్రవర్తన చాలా చిత్రవిచిత్రంగా వుండేది.

నాగరాజు యింట్లో ఏం జరిగిందో సుందరానికి తెలియదు.

ఒకనాటి రాత్రి నాగరాజు భోజనానికి కూర్చుంటూ పెళ్లాంతో అన్నాడు ... 'రేపు ఉదయం తొమ్మిది గంటలకు వాళ్లు రాబోతున్నారు.'

గదిలో గోడకు ఆనుకుని నిలుచున్న గౌరి ఆమాట విన్నది. త్రాటిమీద ఆరవేసిన బట్ట తడి ఆరిపోయి ఎగిరి నేలమీద పడ్డట్టు – గౌరి బలహీనంగా క్రిందికి జారింది. గోడకు ఆనుకుని కూర్చున్నది. ఎవరూ చదవలేని ఆలోచనలు ఆమె చూపుల్లో మెదలసాగాయి.

'అలా కూర్చున్నావేమిటే ? అన్నం తిని పడుకో !' అంది ఆమె తల్లి.

'నాకు ఆకలిలేదు.'

ఆ రాత్రి గౌరికి నిద్రపట్టలేదు. రాత్రి తెల్లవార్లూ మేలుకుని, వేకువజామునెప్పుడో కునుకుతీసింది. ఆమెకు కోడికూత వినిపించలేదు. కాకుల అరపులు వినిపించలేదు. సైరన్ మ్రోత వినిపించలేదు. తల్లి కేక విని అదిరిపడి లేచి కూర్చుంది.

'ఒసే గౌరీ! అదేం మొద్దు నిదర ? లేలే ! '

గౌరి పక్కమీది నుంచి లేచి, తల్లి బలవంతం మీద స్నానం చేసింది. చలువచీర కట్టుకుంది. జడ వేయించుకోటానికి తల్లి ముందు కూర్చున్నది. ఆమె తలదువ్వి జడవేసి, పువ్వులు ముడిచి, కూతురి ముఖాన్ని తన వైపు తిప్పుకుని, వాత్సల్యంగా చూచింది. గౌరి ఆమె కళ్లల్లోకి చూస్తూ 'అమ్మా ... ' అంది. ఏదో చెప్పా లన్న ఆరాటం ఆమె చూపుల్లో కనిపిస్తోంది.

'ఏమే ? '

గౌరి చూపులు క్రిందికి వాలిపోయాయి. ఆమె నోరు మూగ పోయింది.

'ఇంత భయపడి పోతున్నావేమిటే – లోకంలో నీ కొక్క దానికే పెళ్లి అవుతున్నట్టు ? ' అంటూ ముద్దుగా నవ్వింది ఆమె తల్లి.

నాగరాజు ఆరోజు హోటలుకు వెళ్లలేదు. సిల్కు కండవా తీసి భుజాన వేసుకుని, యింట్లోనే కూర్చున్నాడు. పెళ్లిచూపులకు రావలసిన వాళ్లు తొమ్మిదిగంటలకు రానేవచ్చారు. వాళ్లకు జరగవల సిన మర్యాదలన్నీ జరిగాయి.

అబ్బాయి పంట్లాం నలగకుండా కుర్చీమీద కూర్చున్నాడు. అతడు అందంగానే వున్నాడు. ఎత్తుగా, ఎత్తుకు తగినంత లావుగా వున్నాడు. కోరమీసం మీదికి పోతున్న చేతిని బలవంతంగా దించుకుంటున్నాడు. మడతపెట్టిన చేతిరూమాలుతో ముఖం అద్దు కుంటున్నాడు. అతని తల్లిదండ్రులిద్దరూ చాపమీద కూర్చున్నారు. కోడలు కాబోతున్న పిల్లకు – తమకంటే మంచి అత్తమామలు ప్రపంచంలో వెతికినా వుండరనిపించేటట్లుగా – పరమ శాంతంగా వున్నారు వాళ్ళు.

వీపున ఎవరో తుపాకీ ఆనించి నడిపిస్తూన్నట్లుగా – గౌరి వాళ్ల మధ్యకు వచ్చింది. అందరూ ఆమెను పరీక్షగా చూశారు. అబ్బాయి కళ్లు రెప రెపలాడాయి. గౌరి గిర్రున వెనక్కు తిరిగి వంటింట్లోకి వెళ్లిపోయింది.

'అమ్మాయి బాగుంది ! ' అన్నారు ముసలివాళ్లిద్దరూ.

'ఏమిరా ? అంతా మా యిష్టప్రకారమే చేశామని, నింద వెయ్యకు ! అమ్మాయి నీకు నచ్చిందా ? సిగ్గెందుకు ? చెప్పు ! ' అని కొడుకును అడిగారు.

'నచ్చింది !

తలుపు చాటు నుంచి గౌరి గొంతు ఖంగున వినిపించింది... 'నాకు నచ్చలేదు ! '

ఆ ఒక్క మాటతో ఆ యింట్లోని వాతావరణం చిత్రంగా మారిపోయింది. మధురంగా మ్రోగుతున్న వీణాతంత్రులు పుటు క్కున తెగిపోయి, భయంకర నిశ్శబ్దం నెలకొన్నట్లయింది. కుర్చీలో కూర్చున్న అబ్బాయి ముఖంలో ముచ్చెమటలు పోశాయి. అతని తల్లి దండ్రులు – నాటకం పూర్తయిన పిదప రంగులు తుడుచు కుంటున్న వాళ్లలా వికారంగా కనిపించారు. ఆ సమయంలో వాళ్లను చూస్తే, ఏ ఆడపిల్లా వాళ్లకు కోడలు కావటానికి ఒప్పుకోదు.

గౌరియింట్లో వాళ్లందరూ ఆశ్చర్యపోయారు.

'గౌరీ ! ఏమిటమ్మా అది ? ...' అన్నాడు నాగరాజు.

'ఔన్నాన్నా! ... అందరికీ నచ్చితే నాకు నచ్చొద్దూ? ... నేను పెళ్లి చేసుకోను. అంతే!'

నాగరాజు పెళ్లాం కళ్లలో నిప్పులు కురిశాయి.

'ఒసేయ్! నీకు దయ్యం పట్టిందా?'

ముసలివాళ్లిద్దరూ పైకి లేచారు.

'ఒరే అబ్బాయ్! ఇంకా కూర్చున్నావేంరా? నువ్వెంతో అదృష్టవంతుడివి! నీకు తప్పకుండా మంచి పెళ్లాం దొరుకుతుంది! ... పోదాం, లే!'

వాళ్ళు ముగ్గురూ లేచి వీధి గుమ్మంవైపు నడిచారు. నాగరాజు వాళ్ళను అనుసరిస్తూ కాళ్ళా వేళ్ళా పడ్డాడు. 'దానికి మాట్లాడటమే చేతకాదండీ! ఏదో అనబోయి, మరేదో అనేసింది. కుర్రదాని మాటలు మీరు పట్టించుకోకూడదు. శాంతించాలి! అసలు — దానిదొక మాటా? ఇచ్చి పుచ్చుకోవల్సిన వాళ్ళం మనం! మీరిలా కోపగించుకోకూడదు...'

'మనం యిచ్చి పుచ్చుకోవల్సిన వాళ్లమేగానీ, కాపరం చేసే వాళ్ళం కాముగా? మీ అమ్మాయిని ఆమెను నచ్చినవాడికిచ్చి చెయ్యండి. మీ అమ్మాయీ సుఖపడుతుంది, మావాడూ సుఖపడతాడు. ఇంతకూ — చెప్పొద్దూ... మీ అమ్మాయి మాకు నచ్చలేదు.'

'వాళ్ళు వీధి గుమ్మం దాటుకోగానే — నాగరాజు బ్రతిమాలుకోవడం మానేశాడు. అరుగుమీద ఠీవిగా నిలబడి, ఆదరపూర్వకంగా చిరునవ్వు నవ్వుతూ 'క్షేమంగా వెళ్లిరండి! వెళ్లగానే పుత్తరం రాస్తారుకదూ?' అన్నాడు.

'ఎంతమాట!... ఇంక మీరు ఆగండి! మేము వెళ్ళి... వెళ్ళి... మరి మాకు సెలవా?' అన్నారు వాళ్లుకూడా మర్యాదగానే.

వాళ్ళు అలా వెళ్ళిపోగానే — నాగరాజు కోపంగా యింట్లోకి మరలాడు. అప్పటికే — యింటిలోని వాళ్లందరూ గౌరి చుట్టూ చేరి, ఆమెను నానా మాటలూ అనడం మొదలుపెట్టారు.

'ఎంతకు తెగించావే! నీ ముఖానికి వాడికంటే చక్కటి మొగుడు దొరుకుతాడనుకున్నావా? ఏం? వాడెందుకు నచ్చలేదు? నీ అందం వాడికి లేదనా దరిద్రపుముండా!' అంటూ ఆమె తల్లి మూతిమీద పొడిచింది.

అందరూ అలా తిడుతూవుంటే గౌరికికూడా కోపం వచ్చింది.

'మీరు చేసుకోమన్నవాణ్ణే నేనెందుకు చేసుకోవాలి? మీకు చేతనైతే నన్ను సుందరానికిచ్చి చెయ్యండి!'

'ఏ సుందరం?'

'రాజమ్మ కొడుకు!'

ఆమె మాటలు విని అందరి ముఖాలూ వెలవెలబోయాయి. నాగరాజుకు కోపం వచ్చింది. అయితే అతడు ఆ కోపాన్ని గౌరిమీద ప్రయోగించలేకపోయాడు.

'ఆ వెధవనా? వాణ్ణి పొడిచి పారేస్తాను!' అన్నాడు వాసు.

నాగరాజు పెళ్ళాం విస్మయంతో నోరు నొక్కుకుంది. 'నీకేమన్నా పిచ్చెక్కిందా ఏమిటే? వాళ్ళ కులమేమిటే, మన కులమేమిటే, నీకు కళ్ళు మూసుకుపోయాయి... విన్నారాండీ దాని మాటలు?'

'ఏ కులమైతేనేం? మనకింకా కులంగోత్రం అంటూ వుందా? అక్కయ్య పెళ్ళికి అడ్డురాని కులం నా పెళ్ళికే వొచ్చిందా?' అంది గౌరి.

నాగరాజు యింట్లోనుంచి చరచరా హోటలుకు నడిచాడు. కుర్చీలో కూలబడ్డాడు. ఎప్పుడూ ఏదో ఒకటి వాగుతూవుండే అతని నోటికి ఆ రోజు తాళం పడిపోయింది.

గౌరి అన్నది నిజమే! తానింకా కులాన్ని పట్టుకుని వేలాడటం దేనికీ?

అతని పెద్దకూతురు రంగనాయకి భర్త పేరు చిన్నయ్య. ఐదేళ్ళక్రితం అతను నాగరాజు హోటల్లో పనిచేస్తూ వుండేవాడు. పొట్టిగాను, నల్ల రాయిలా బలిష్టంగానూ ఉండేవాడు. బల్లలు తుడిచేవాడు. గిన్నెలు కడిగేవాడు. రంగనాయకితో కలిసి వెళ్ళి చేద బావిలోనుంచి నీళ్ళు తెచ్చేవాడు. అతనికి నా అన్నవాళ్ళెవరూ లేరు. ఒంటరిగా వుండేవాడు. రాత్రుల్లో హోటలు పాకలోనే పడుకునేవాడు. అతనికీ, రంగనాయకికీ ఎలాగో స్నేహం కలిసింది. అర్థరాత్రివేళల్లో ఎవరూ చూడకుండా ఆమె హోటల్లోకివెళ్లి, అతనితో గడిపి రావడానికి అలవాటు పడింది. నాగరాజు ఈ సంగతి కనిపెట్టాడు. ఓ రాత్రిపూట వాళ్లిద్దరూ అతనికి దొరికిపోయారు. అతడు చిన్నయ్యను చావగొట్టాడు. ఇక ఈ వూళ్ళో కనిపిస్తే ప్రాణం తీసేస్తానని బెదిరించాడు. తెల్లవారిన తర్వాత — చిన్నయ్య ఆ వూళ్లో కనిపించలేదు. వారం రోజుల తర్వాత రంగనాయకికూడా మాయమైపోయింది. వాళ్ళిద్దరికీ ఎవరిద్వారానో రాయబారం నడిచినట్లుంది. ఇద్దరూ పొరుగూరికి వెళ్ళి గుళ్లో పెళ్లి చేసుకున్నారు. కొత్తలో — నాగరాజుకు, వాళ్లకు మధ్య పచ్చిగడ్డి వేస్తే భగ్గుమనేది కానీ, ఇప్పుడిప్పుడే ఆ పట్టుదలలు సమసిపోయి, ఒకరి యింటికి మరొకరు వెళ్లిరావడం జరుగుతోంది.

రంగనాయకి నాగరాజుకు ఒక సమస్యను తెచ్చిపెట్టినా, ఆ

సమస్యను తానే పరిష్కరించుకొంది, గౌరి అలా కాదు!... ఈ సమస్య పరిష్కారం కావడం ఎలా ?

చిన్నయ్య తక్కువ కులం వాడు. ఒంటరివాడు. పైగా ఇష్టపడ్డాడు గనుక సరిపోయింది. సుందరం విషయం అలా కాదు, అడిగి భంగపడడంతప్ప—ఫలితంవుండదు, గౌరికి ఇలాంటిపాడుబుద్ధి ఎందుకు పుట్టాలి? వట్టి మొండి పట్టు ఆమెది! ఆమె మనస్సుకు విరుద్ధమైతే, మరొకరి శాసనాన్ని అంగీకరించదు. కన్నతండ్రికైనా భయపడదు. అయితే మాత్రం—మూర్ఖమైన పట్టుదలతో సంకల్పాలు నెరవేరిపోతాయా ?

వూరుకోవడం కంటే వో ప్రయత్నం చేసిచూస్తే మంచిదేమో ! నిన్న మొన్నటిదాకా రాజమ్మ కూలీనాలీ చేసి బ్రతికిందేగా? కులం ఎక్కువైనా అంతస్తులేని కుటుంబం. అలాంటి వాళ్లకు సంఘంలో మర్యాద వుండదు. ఇంకా కులమేమిటీ? తాను పెళ్లి అడిగితే రాజమ్మ ఒప్పుకోవచ్చు. కట్నం రెండువేలిస్తానంటే లొంగి రాకపోతుందా?

మధ్యాహ్నం మీదట నాగరాజు ఇంటికి వెళ్లాడు. 'రాజమ్మను అడిగిచూస్తాను, ఏమంటుందో!' అన్నాడు పెళ్లాంతో.

'దానికే అనుకున్నాను. మీకు కూడా మతి పోయింది!' అంది ఆమె.

ఆ మాట అతన్ని నిరుత్సాహపరచింది.

'పెళ్లి అడిగినంత మాత్రంలో మన పరువేం పోదులే!' అన్నాడు.

ఆ సాయంకాలం అతను రాజమ్మ యింటికి వెళ్లాడు. జంకుతూ లోపల అడుగుపెట్టి, గొంతు సవరించుకుని 'రాజమ్మా!' అని పిలిచాడు.

అతని రాకకు రాజమ్మ విస్మయం చెందింది.

'రండి! కూర్చోండి!' అంది మర్యాదగా.

నాగరాజు చాలా మర్యాదగా నవ్వుతూ కుర్చీలో కూర్చున్నాడు. ఎలా ప్రారంభించాలో అతనికి తోచలేదు.

'మీ అబ్బాయి లేడామ్మా?'

'ఇంకా స్కూలునుంచి రాలేదండీ!'

'...జరిగిందానికి చింతిస్తున్నానమ్మా!...... తొందరపడి అబ్బాయి మీద చెయ్యి చేసుకున్నాం, ఏదో పొరబాటైపోయింది.అదేమీ మీరు మనసులో పెట్టుకోకూడదు......'

రాజమ్మ చిరునవ్వుతో— 'ఎప్పటి మాటండీ అది? మూడు నెలలైపోతున్నాయి. మేము ఎప్పుడో మరిచిపోయాను' అంది.

ఆమె టేబుల్ సొరుగులోంచి ఓ కాగితాన్ని బయటకి లాగి అతని చేతికిచ్చింది.

'ఏమిటమ్మా ఇది?'

'మా వాడికి పెళ్లండీ! రేపటి వారమే ముహూర్తం! వాడి మేనత్త కూతురే! పెళ్లి - వాళ్లింటోనే! మీకు పెళ్లి పత్రిక పంపుదామనే అనుకున్నాను. ఈలోగా మీరే వచ్చారు. పెళ్లికి తప్పకుండా రండి!'

ఆశ్చర్యచకితుడైన నాగరాజు ముఖ కవళికలు మారిపోయాయి. తన ముఖంలోని భావాలను దాచుకోవడానికి ప్రయత్నిస్తూ 'అలాగేనమ్మా! తప్పకుండా!... మరినేను సెలవు పుచ్చుకుంటాను.' అంటూ వీధిలోకి వచ్చేశాడు.

నాగరాజు చాలా సిగ్గుపడ్డాడు. ఇంత వయస్సొచ్చికూడా తాను పసిపిల్లవాడై పోతున్నాడేమిటీ? తన కూతురుకీ, రాజమ్మ కొడుక్కీ పెళ్లిని తాను ఎలా ఊహించాడు? మరీ మేలే! నోట్లోమాట నోట్లో వుండగానే- పరువుగా బయటి కొచ్చేశాడు. లేకుంటే, ఊళ్లో నవ్వులపాలై పోయివుండేవాడు.

ఈ గౌరికి కొంచెమైనా బుద్ధిలేదు. అది చెప్పినట్లు తాను వినేదేమిటీ ? పిల్లలెప్పుడూ పెద్దలమాటే వినాలి ! గౌరి వినకపోతే, దాని చెవులు మెలేసి, వినేటట్లు చెయ్యాలి.

అతను తిన్నగా హోటలుకు వెళ్ళాడు. రాత్రి చాలా ఆలస్యంగా యింటికి వెళ్ళాడు. ఇల్లంతా నిశ్శబ్దంగా వుంది. గౌరి కనిపించలేదు. అతడు గదిలోపలికి తొంగిచూశాడు. గౌరి తల విరబోసుకుని, గోడవైపు తిరిగి పడుకొనివుంది.

నాగరాజు పెరట్లోకి వెళ్ళి, కాళ్ళుచేతులు కడుక్కొనాడు. పైగుడ్డతో ముఖం తుడుచుకుంటూ 'ఆకలిగా వుంది అన్నంపెట్టు' అన్నాడు పెళ్ళాంతో.

ఆమె అతని కళ్ళలోకి చూస్తూ 'అన్నం చెయ్యలేదు' అంది. ఆమె కళ్ళలో భయం, దిగులు దోబూచులడుతున్నాయి.

'ఎందుకు చెయ్యలేదు ?'

ఆ ప్రశ్నకు ఆమె సమాధానం చెప్పలేదు.

'వాళ్ళతో మాట్లాడారా ?' అంది.

'ఎవరితో ?'

'రాజమ్మతో !'

'అవ. రం లేదు.'

'ఎందుకూ ?'

'అంతా చెయ్యిదాటిపోయింది.'

'వెళ్ళి వాళ్ళ కాళ్ళయినా పట్టుకోండి ! లేకపోతే మనకొంప మునుగుతుంది.'

'ఏమంటున్నావు ?' అంటూ నాగరాజు అనుమానంగా ఆమె వైపు చూశాడు. ఆమె పెదాలు అతని చెవిలో గుసగుసలాడాయి. ఆ సమయంలో గదిలోని గౌరి గువ్వలా ఒదిగిపోయి వుంటుంది.

నాగరాజు నెత్తిన పిడుగు పడ్డట్లయింది.

'నిజంగానా ?'

అతడు పిచ్చివాడిలా నెత్తిబాదుకున్నాడు. కోపంతో వూగిపోయాడు. విసురుగా గదిలోకి వెళ్ళాడు. 'గౌరీ !' అంటూ మేఘంలా గర్జించాడు. మరుగుతున్న పాత్రమీది మూతలా త్రుళ్ళిపడింది గౌరి.

'మీ అమ్మ చెప్పింది నిజమేనా ?' అని వురుముతూ ఆమె కళ్ళలోకి సూటిగా చూశాడు నాగరాజు.

అతని చూపులను భరించలేక గౌరి తలవంచుకొంది.

'ఎందుకుచేశావ్ ఆపని ?'

గౌరీ శరీరం గడగడలాడింది.

'నిన్ను చంపేస్తాను. పాతిపెట్టేస్తాను.' అంటూ నాగరాజు ఆమెను చావబాదేశాడు. ఆ దెబ్బలకు — పెనుతుపానులో చెట్టులా ఊగిపోయింది గౌరి. ఆమె తల్లులిద్దరూ అడ్డుపడకపోతే, ప్రాణమైనా మిగిలివుండేదికాదు.

గౌరి ఏడవలేదు. ఆమెకు తండ్రిమీద కోపం వచ్చింది. ఆమెలో పౌరుషం పెరిగిపోయింది. తండ్రిమీద ప్రతీకారం తీర్చుకోవాలనిపించింది.

గౌరి నడిజామువేళ లేచి వీధిలోకి వెళ్ళింది.

చేదబావిలో దూకబోతుండగా — వెనకనుంచి వాసు పరుగెత్తుకొచ్చి, ఆమెను పట్టుకున్నాడు. ఆమె కోపంతో అతన్ని తిట్టింది. కేకలు వేసింది. వీధిలోని వాళ్ళంతా మేలుకున్నారు. వాసు ఆమెను బరబరా లాక్కెళ్ళి, ఇంట్లోకి నెంటాడు.

'ఏమిటి ? ఏం జరిగింది ?' అన్నారు ఇరుగుపొరుగువాళ్ళు.

'ఏముంది ? వాళ్ళ నాన్న కొట్టాడని ఇలా ఆగడం చేస్తోంది' అంది నాగరాజు భార్య.

ఆమె యింటిలోపలికి వెళ్ళి తలుపుమూసి, గౌరి జుట్టుపట్టుకుని గుంజుతూ — 'సిగ్గుమాలిందానా ! నువ్వు మమ్మల్ని పరువుగా బతకనియ్యవు.' అంది.

గౌరి వాసును తిట్టింది. 'బేట్వా ! చచ్చిపోదామనుకుంటే నన్నెందుకురా లాక్కొచ్చావు ? ఈ కసాయివాళ్ళచేత దెబ్బలుతిని చావటానికా ? ... ఎన్నిరోజులు కాపలాకాస్తారో నేనూ చూస్తాను. ఇప్పుడు కాకపోతే రేపైనా చస్తాను.'

నాగరాజు ఆమెను సమీపించాడు. భార్య చేతుల్లోంచి ఆమె జుట్టును విడిపించాడు.

'అమ్మా గౌరీ! నువ్వు చచ్చిపోవద్దు. నేనింకా బతికే వున్నాను. నిన్ను బతికించటానికి ఎంత దుర్మార్గమైనా చేస్తాను. నా ప్రాణమైనా బలిపెడతాను. ఆమాట మళ్ళీ అనకు !' అంటూ ఆమె తల నిమిరాడు.

గౌరి కేకలు ఆగిపోయాయి.

'చెప్పమ్మా ! వాడెవడు ?'

గౌరి శ్వాస స్తంభించింది.

'వాడేనా ? రాజమ్మ కొడుకేనా ?'

గౌరి బావురుమని ఏడ్చింది.

నాగరాజు ఆమె కన్నీళ్ళు తుడిచాడు. 'ఏడవకు ! వెళ్ళి పడుకో ! దిగులుపడకుండా హాయిగా నిద్రపో !' అన్నాడు.

ఇంట్లో క్రమంగా సద్దుమణిగింది.

నాగరాజుకు నిద్రపట్టలేదు. అతడు వెల్లకిలా పడుకుని, ఆలోచిస్తున్నాడు. నీతి, న్యాయం, ధర్మం, పుణ్యం మొదలైనవాటికంటే బ్రతకడం అనేది ఒక్కటే అతనికి విలువైనదిగా కనిపించింది.

అతని కళ్ళు ఎర్రగా వున్నాయి !

**(స శే ష ము)**